## క్లుప్తంగా

### ఆలోచిద్దాం.. ప్లాస్టిక్‌ను వదిలేద్దాం



జి.వేమవరంలో గణేశ ఉత్సవాల అన్నదానంలో స్టీలు ప్లేట్లలో వడ్డిస్తున్న దృశ్యం

**తాళ్లరేవు:** ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసుల్లో ఆహార పదార్థాలను తీసుకోవడం ద్వారా క్యాన్సర్ వంటి ప్రమాదకరమైన వ్యాధులు సంభవించే అవకాశం ఉంటుందని జి.వేమవరం సర్పంచ్ పుణ్యమంతుల సూరిబాబు ఒక వినూత్న ఆలోచన చేశారు. ప్రధానంగా వేడి ఆహార పదార్థాలను ప్లాస్టిక్ ప్లేట్లలో తినడం ద్వారా ప్లాస్టిక్ కణాలు ఆహారంలో ప్రవేశించి అవి క్యాన్సర్ కారకాలు మారతాయని తెలుసుకుని, గ్రామంలో ఏ ఒక్కరూ ప్లాస్టిక్ ప్లేట్లలో తినకూడదని నిర్ణయించుకున్నారు. తొలివిడతగా వంద ప్లేట్లను కొనుగోలు చేసి గ్రామంలోని గొల్ల్రిపూడి పొలిమేర కాలువ వద్ద పుణ్యమంతుల ఫకీర్రావు సెంటర్ వద్ద నెలకొల్పిన గణపతి నవరాత్రి ఉత్సవాలు ముగిసిన సందర్భంగా అన్నదాన కార్యక్రమంలో గ్రామ పెద్దలు, అధికారులు, ఉపాధ్యాయులు, మహిళలకు తాను కొనుగోలు చేసిన స్టీలు ప్లేట్లలో భోజనాలు వడ్డించి అవగాహన కల్పించారు. రెండు వేల స్టీలు ప్లేట్లు కొనుగోలు చేసి పంచాయతీ కార్యాలయంలో అందుబాటులో ఉంచుతామని, ఎటువంటి కార్యక్రమానికైనా ప్రజలు వాటిని తీసుకువెళ్లవచ్చని సూరిబాబు తెలిపారు.

### కామనగరువులో ఉచిత వైద్య శిబిరం

**అమలాపురం రూరల్:** కామనగరువు గ్రామ పంచాయతీ వద్ద రోహిణి తల్లీ పిల్లల ఆసుపత్రి ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. తొలుత దీనిని సర్పంచ్ నక్కా అరుణ కుమారి చంద్రశేఖర్ ప్రారంభించారు. చిన్న పిల్లల వైద్యుడు వీఎస్ఎస్ఎన్ మూర్తి, గైనకాలజిస్ట్ శారదలు 100 మంది పిల్లలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ మూర్తి దంపతులను సర్పంచ్ అరుణకుమారి చంద్రశేఖర్ ఘనంగా సన్మానించారు.

### దరఖాస్తులు అప్‌డేట్ చేయాలి

**యానాం:** పుదుచ్చేరి పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న 70 ఎస్సై పోస్టుల భర్తీకి గత నెల 12న నోటిఫికేషన్ విడుదల చేశారని, ఆ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు, అదేవిధంగా 2022 నవంబర్ 8న మరో నోటిఫికేషన్ సందర్భంగా దరఖాస్తు చేసుకున్న ఇన్‌సర్వీసు అభ్యర్థులతో సహా అందరూ తమ వివరాలను వెబ్‌సైట్‌లో అప్‌డేట్ చేయాలని శనివారం పోలీసు శాఖ ప్రత్యేకఅధికారి ఆర్ ఎలుమలై ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17లోగా అప్‌డేట్ చేసుకోవాలని కోరారు.

### ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలి

**అమలాపురం టౌన్:** ప్రభుత్వ విద్యా సంస్థ అయిన నూజివీడు రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ ట్రిపుల్ ఐటీలో ఇంజినీరింగ్ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు ప్రభుత్వం తక్షణమే రీయింబర్స్‌మెంట్ ఫీజులు చెల్లించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌పై కొందరి బాధిత విద్యార్థులతో కలసి తిరుపతిరావు అమలాపురంలో ఎంపీ గంటి హరీష్ మాధుర్‌ను శనివారం కలసి వినతిపత్రం అందించారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో కోర్సు పూర్తి చేసి నాలుగు నెలలు గడుస్తున్నా విద్యార్థులకు ఇంకా సర్టిఫికెట్లు ఇవ్వలేదని ఎంపీ దృష్టికి తీసుకు వెళ్లారు. సర్టిఫికెట్లు అత్యసరమైతే రూ. 2.25 లక్షల ఫీజు చెల్లించి తీసుకెళ్లాలని ఆ యూనివర్సిటీ అధికారులు అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ఎ.సునీత, బి.వర్మ, పీడీఎస్‌యూ ప్రతినిధులు పాల్గొన్నారు.

### గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

**కాట్రేనికోన:** చెయ్యేరు శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాలలో 2021–25 విద్యా సంవత్సరం విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. దీనిని కళాశాల కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ డీవీఎస్ఎస్ వర్మ ప్రారంభించారు. సెంచురియన్ విశ్వవిద్యాలయం కులపతి జీవీఎస్ఎన్ రాజు, తక్షశిల యూనివర్సిటీ ప్రోచాన్సలర్ రాజారాజన్ ధనశేఖర్, శ్రీనివాస ఇంజినీరింగ్ కళాశాల వైస్ చైర్మన్ డీవీఆర్‌పీ రాజు హాజరై మాట్లాడారు. పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

# ఇదే మంచినీరు



పిచ్చి మొక్కలతో దర్శనమిస్తున్న దరియాలతిప్ప రక్షిత మంచినీటి చెరువు



రక్షిత మంచినీటి పథకం ట్రీట్‌మెంట్ ప్లాంట్

- ఆధునీకరణకు దూరంగా మంచినీటి చెరువు
- అపరిశుభ్రంగా పరిసరాలు
- ఏళ్లు గడుస్తున్నా ఇదే దుస్థితి

**యానాం:** తీర గ్రామాల ప్రజల దాహార్తి తీర్చే దరియాలతిప్ప రక్షిత మంచినీటి పథకం ఆధునీకరణకు దూరంగా ఉంది. ముఖ్యంగా మంచినీటి చెరువు పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. అదేవిధంగా చెరువులోని పూడికను సైతం తీయడం లేదు. ఫలితంగా ఈ నీరు తాగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దరియాలతిప్ప రక్షిత మంచినీటి పథకం ద్వారా నియోజకవర్గానికి శివారున ఉన్న తీర గ్రామాలైన సావిత్రినగర్, గిరియాంపేట, దరియాలతిప్ప, దొమ్మేటిపేట, పరంపేట తదితర గ్రామాలకు తాగునీటి సరఫరా జరుగుతుంది. ఈ నేపథ్యంలో తీర గ్రామాలకు దాహార్తిని తీర్చే కీలకమైన మంచినీటి ప్రాజెక్టుగా చెబుతారు. అయితే ఇంతటి కీలకమైన పథకం పరిధిలోని రక్షిత మంచినీటి చెరువును ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం లేదు. చెరువు పరిసరాలు పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్నాయి. అక్కడ నాచుపట్టి నీరు పచ్చగా ఉంటుందని, దానిని శుభ్రం చేసి నీరు సరఫరా చేస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువు చుట్టూ రివెట్‌మెంట్ ఇప్పటి వరకూ వేయకపోవడంతో శుభ్రత కరవైందని చెబుతున్నారు. దీనికితోడు చెరువులోని పూడికను తొలగించడం లేదు. చెరువు కాస్తా ఊబిగా మారిపోతుందని గ్రామస్తులు అంటున్నారు.

**అనేక ఏళ్లుగా నీరందిస్తూ..**

దరియాలతిప్ప రక్షిత మంచినీటి పథకాన్ని 20 ఏళ్ల కిందట నిర్మించారు. దీని నిర్మాణం 1996లో ప్రారంభం కాగా, 1997లో పూర్తయ్యింది. దీనిని అప్పటి లెఫ్టినెంట్ గవర్నర్ రాజేంద్రకుమారి బాజ్‌పేయి ప్రారంభించారు. దీనిద్వారా పది లక్షల లీటర్ల నీటిని ప్రతి రోజూ రెండు పూటలా ప్రజలకు సరఫరా చేస్తున్నారు. చెరువులో గ్రౌండ్ లెవెల్ రిజర్వాయర్(జీఎల్ఆర్) ద్వారా లోతు తదితర వాటిని అధ్యయనం చేసి ఆ మేరకు చెరువులోని పూడికను తీయాలి. ఆ విధంగా సుమారు వెయ్యి లారీల పూడికను తీయాల్సి ఉందని, కాని గత ఏడాది తూతూ మంత్రంగా చేసిన ప్పటికీ పరిస్థితి అలానే ఉందంటున్నారు.

**పసర రంగులో నీరు..**

తీర గ్రామాలకు సరఫరా చేసే తాగునీరు పసర రంగులో ఉంటుందని ప్రజలు చెబుతున్నారు. ముఖ్యంగా పత్తిగొంది సమీపంలోని ఫ్రెంచ్ కెనాల్ నుంచి కాలువ ద్వారా వచ్చే నీరు సైతం పూడికతో ఉంటుండటంతో ఆ నీరు కాస్తా రక్షిత మంచినీటి పథకం వద్దకు చేరుతుందని, దానినే శుభ్రం చేసి ఇస్తున్నారని అంటున్నారు. తీర గ్రామాల్లోని వేలాది మందికి తాగునీరు అందించే దరియాలతిప్ప రక్షిత మంచినీటి పథకాన్ని ఆధునీకరించాలని లెఫ్టినెంట్ గవర్నర్ కె.కై లాషనాథన్‌కు గ్రామస్తులు వినతి పత్రం అందించారు. ఇప్పటికైనా ఆయన స్పందించి ఇబ్బంది తొలగించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

**మేమే బాగుచేసుకుంటాం..**



దరియాలతిప్ప రక్షిత మంచినీటి చెరువు ఆధునీకరించాలని చాలా ఏళ్లుగా అధికారులకు తెలియజేస్తున్నాం. కానీ దీని గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. చెరువులో పూడిక తీయకపోవడంతో నీరు నల్లగా మారుతున్నాయి. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ప్రభుత్వం చేయకపోతే చెరువును గ్రామస్తులకు అప్పగిస్తే బాగుచేసుకుంటాం.

– సబ్బతి శ్రీనివాసరావు, గ్రామపెద్ద, దరియాలతిప్ప

### 18న పుదుచ్చేరి అసెంబ్లీ సమావేశం

**యానాం:** పుదుచ్చేరి అసెంబ్లీ ప్రత్యేక సమావేశం ఈ నెల 18న నిర్వహిస్తున్నట్లు శనివారం ఆర్ స్పీకర్ సెల్వం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా పలు బిల్లులపై చర్చ జరుగుతుందన్నారు. ముఖ్యంగా వాణిజ్యం సులభతరం చేయడానికి ఉద్దేశించిన బిల్లులతో సహా కొన్ని చట్టాలపై సభలో సభ్యులు చర్చిస్తారన్నారు. అదేవిధంగా గత బడ్జెట్ సమావేశంలో చేసిన ప్రకటనల స్థితితో పాటు పుదుచ్చేరికి రాష్ట్ర హోదాపై ప్రధానంగా చర్చ ఉంటుందన్నారు. ఈ మేరకు తనకు సమావేశంపై సమాచారం అందిందని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు.

### జీఎస్టీ తగ్గింపుతో పేదలకు ఉపశమనం

**అమలాపురం రూరల్:** కేంద్రం తగ్గించిన జీఎస్టీతో పేద, మధ్యతరగతి వర్గాలకు ఉపశమనం కలుగుతుందని రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి నల్లా పవన్‌కుమార్ అన్నారు. శనివారం అమలాపురంలో జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పిల్లల చదువుకు ఉపయోగపడే బుక్స్, పెన్స్, పెన్సిల్స్, రబ్బర్లు లాంటి స్టేషనరీపై జీరో పర్సెంట్ జీఎస్టీ చేశారన్నారు. ద్విచక్ర వాహనాలు, ఫిడ్జ్, వాషింగ్ మెషీన్లు, మిక్సీలు, గ్రైండర్‌లపై జీఎస్టీ భారీగా తగ్గించారన్నారు. పట్టణ బీజేపీ అధ్యక్షుడు అయ్యల భాషా,పావులూరి వెంకట్, కార్యదర్శి రాజు, బండి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వైద్య కళాశాలల ప్రైవేటీకరణ దుర్మార్గం

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ శ్రీకాంత్



కామనగరువులో వైద్య కళాశాల భవనాల వద్ద మాట్లాడుతున్న డాక్టర్ శ్రీకాంత్

**అమలాపురం రూరల్:** దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ఏకంగా 17 వైద్య కళాశాలలను మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేస్తే, వాటిని ప్రైవేటీకరణ చేసేందుకు సీఎం చంద్రబాబు నిర్ణయించడం దుర్మార్గమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ డాక్టర్ పినిపే శ్రీకాంత్ అన్నారు. అమలాపురం మండలం కామనగరువు, బడుగువారిపేట వద్ద గత ప్రభుత్వంలో నిర్మాణం ప్రారంభమై ప్రస్తుతం నిలిచిపోయిన వైద్య కళాశాల భవనాలను వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులతో శనివారం శ్రీకాంత్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పదిహేనేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు రాష్ట్రానికి ఒక్క వైద్య కళాశాల కూడా తేలేదన్నారు. ఇప్పుడు పీపీపీ విధానం ద్వారా పది కళాశాలలను తన సొంత వ్యక్తులకు కట్టబెట్టేందుకు కుట్రకు తెర తీశారని అన్నారు. తద్వారా రూ.వేల కోట్లను దోచుకునేందుకు ప్రణాళిక సిద్ధం చేశారని అన్నారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి 17 వైద్య కళాశాలలు తీసుకొచ్చి, పేదలకు వైద్య విద్య చేరువ చేయాలని ప్రయత్నించారన్నారు. ఈ కళాశాలల నిర్మాణాలు నిలిపివేసి చంద్రబాబు ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెడుతూ పేదలకు అన్యాయం చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు గుత్తుల చిరంజీవిరావు, మున్సిపల్ చైర్మన్ రెడ్డి నాగేంద్రమణి, ఎంపీటీసీ సభ్యులు చొల్లంగి సుబ్బిరామ్, రేవు శ్రీను, మెండి నాగలక్ష్మి, ఉప సర్పంచ్ రాజులపూడి భాస్కరరావు, సర్పంచ్ గణేష్, నాయకులు సూదా గణపతి, నక్కా చంద్రశేఖర్, సరేళ్ల రామకృష్ణ, కముజు రమణ, ములపర్తి శ్రీను, రాజులపూడి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# దళిత సమస్యలపై పోరాటం

**యానాం:** దళిత వర్గాల సమస్యలపై పోరాటం చేస్తున్న దళిత సాహిత్య అకాడమీ దక్షిణ భారత శాఖ అధ్యక్షుడు పొనుగుమట్ల విష్ణుమూర్తిని పలువురు అభినందించారు. శనివారం స్థానిక పాత బస్టాండ్‌లోని అంబేడ్కర్ సర్కిల్‌లో దళిత సంఘాలు, అంబేడ్కర్ యువజన సంఘాల ఆధ్వర్యంలో విష్ణుమూర్తి 80వ పుట్టినరోజును ఘనంగా నిర్వహించారు. ఎస్సీ ఫీల్డ్ లేబర్ సొసైటీలు ఏర్పాటు చేసి, వాటి ద్వారా వందలాది ఎకరాల లంక భూములను ఇప్పించడంలో విష్ణుమూర్తి కృషిని కొనియాడారు. రిటైర్డ్ ఆర్ఏఓలు నామాడి అప్పారావు, గిడ్డి బలరామ్, నాయకులు కోరుకొండ ప్రసాదరావు, పండు సిద్ధార్థ, గుర్రపు ప్రహ్లాదుడు, ముర్రే మీరాసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం



తాళ్లరేవు హైస్కూల్‌లో ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న తోటి ఉపాధ్యాయులు



తూర్పులంకలో ఉపాధ్యాయులను సన్మానించిన సభ్యులు

**తాళ్లరేవు:** స్థానిక శ్రీమతి నామన వెంకాయమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురుపూజోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన గెజిటెడ్ హెచ్ఎం వి.ప్రసాదరావు, జి.సూర్యచంద్రరావు, ఐ.శ్రీలత, కేవీ రమణిలను సత్కరించారు. స్టాఫ్ సెక్రటరీ వాకపల్లి అప్పారావు, ఇన్‌చార్జి హెచ్ఎం ఎం.బాలసుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

**అమలాపురం రూరల్:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జిల్లా, మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరించారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు అశోక్ కుమార్, సత్యప్రియ యావమ్మ, సరాకుల గోపిరాజులను, లంకా రాణి, భమిడిపాటి రామకృష్ణ, స్కూల్ అసిస్టెంట్ బి.లక్ష్మీతులసి, పీడీ బీవీఎస్ మూర్తి, పీఈటీ విష్ణుప్రసాద్‌లను సన్మానించారు. మండల ఉత్తమ ఉపాధ్యాయులు సురేష్‌బాబు, లక్ష్మి, మంగాదేవి, గంటా కనక దుర్గాదేవి, కేవీవీ సత్యనారాయణ, మద్దెల సుజాతలను కుడిపూడి భాగ్యలక్ష్మి సత్కరించారు. స్వాతంత్ర్య దిన వేడుకల్లో కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తమ అవార్డు అందుకున్న మండల విద్యా శాఖాధికారి గుబ్బల సూర్య ప్రకాశంను సన్మానించారు. ఎంఈఓ ఎస్.దుర్గాదేవి, యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు పెంకె వెంకటేశ్వరరావు, పోతంశెట్టి దొరబాబు పాల్గొన్నారు. జిల్లా ఉత్తమ అవార్డు సాధించిన ఇందుపల్లి హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని లంక రాణిని ఆ హైస్కూల్‌లో గ్రామస్తులు సన్మానించారు. సర్పంచ్ చొల్లంగి శివాలిని అప్పాజీ, గ్రామ పెద్దలు మల్లుల పోలయ్య పాల్గొన్నారు. ఈ పాఠశాల అభివృద్ధికి ఉప సర్పంచ్ హనుమాన్ బుజ్జి 10,116, బండి సర్వేశ్వరరావు రూ. 5 వేలు, వీరబ్రహ్మం రూ.2 వేలు, మ్యాథ్స్ ఉపాధ్యాయుడు త్రిమూర్తులు షెడ్డు నిర్మాణానికి అయ్యే ఖర్చులు ఇస్తానని తెలిపారు.

**అల్లవరం:** సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. టీచర్స్ డే పురస్కరించుకుని తూర్పులంక ఉన్నత పాఠశాలలో గురుపూజోత్సవాన్ని నిర్వహించారు. ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో మండల విద్యాశాఖాధికారి సానబోయిన ఏడుకొండలు, ప్రధానోపాధ్యాయులు ఉదయభాను మల్లపురాజు, ఉపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, రమేష్‌రాజు, కేదాసి సత్యనారాయణ, బత్తుల నకులరాజు, శారదామాత, గణేష్‌కుమార్, ముత్యాల నరసింరావు, ఎస్‌పీఎల్ సత్యవతిలను సత్కరించారు.

# వెళ్లిరా... విఘ్ననాయకా

- ఘనంగా గణేశ విగ్రహాల నిమజ్జనం
- భారీ ఊరేగింపులతో ఉత్సవం



కామాక్షీ పీఠంలో సిద్ధి, బుద్ధి సహిత గణపతి కల్యాణాన్ని నిర్వహిస్తున్న పండితులు



కాపులపాలెంలో స్వామివారిని నిమజ్జనానికి తీసుకు వెళ్తున్న భక్తులు



కొత్తలంకలో స్వామివారి లడ్డూను రూ.లక్షకు దక్కించుకున్న పెద్దిరెడ్డి నాగు తదితరులు



చింతలమెరకలో వినాయక విగ్రహ ఊరేగింపు

**ముమ్మిడివరం:** వెళ్లిరా.. విఘ్ననాయకా అంటూ వినాయక నవరాత్రుల్లో పూజలందుకున్న స్వామివారిని భక్తులు ఘనంగా సాగనంపారు.. వినాయక విగ్రహ నిమజ్జనోత్సవాలు ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి.. ఆయా గ్రామాల్లో గణేష్ విగ్రహాలను ప్రత్యేక వాహనాల్లో ఉంచి ఊరేగించారు. ముమ్మిడివరం మార్కెట్ సెంటర్ శ్రీలక్ష్మీ గణపతి ఆలయం, రాయుడువారి పాలెం, రాజుపాలెం, కుమ్మరివీధి, క్రాపపాలెం, గాడిలంక, కొమానపల్లి మర్లపాలెం బాలయోగి కాలువ గట్టు, కర్రివానిరేవు, చింతల మెరక గణపతి ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో స్వామివారి విగ్రహాలకు ఊరేగింపులు నిర్వహించారు. పల్లవారిపాలెం వరసిద్ధి వినాయక స్వామి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పది కిలోల స్వామివారి లడ్డూకు వేలం నిర్వహించగా, గ్రామానికి చెందిన జక్కంపూడి జేసు కృష్ణఉమా మణికంఠమూర్తి రూ. 34,500కు దక్కించుకున్నారు. కొత్తలంక కాపుల వీధిలో వరసిద్ధి వినాయక స్వామివారి నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా స్వామివారికి సమర్పించిన పెద్ద లడ్డూను పెద్దిరెడ్డి నాగు రూ.లక్షకు, చిన్న లడ్డూను జైను లక్ష్మణ స్వామి రూ.60 వేలకు దక్కించుకున్నారు. అనంతరం మురమళ్ల రాఘవేంద్ర వారధి సమీపంలో వృద్ధ గౌతమి గోదావరి పాయలో వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య విగ్రహాలను నిమజ్జనం చేశారు.

**కల్యాణం.. కమనీయం**

**అమలాపురం టౌన్:** స్థానిక శ్రీకామాక్షీ పీఠంలో సిద్ధి, బుద్ధి సహిత శ్రీగణపతి కల్యాణం వైభవంగా జరిగింది. పీఠంలోని శ్రీకామాక్షీ రత్న కల్యాణ మండపంలో బ్రహ్మశ్రీ పూజ్యం నాగేశ్వరశర్మ, సాయి శర్మ ఆధ్వర్యంలో దివ్య కల్యాణ మహోత్సవం నిర్వహించారు. పీఠం ఉత్తరాధికారి విఘనస రాఖీప్రేమ్ పర్యవేక్షించారు. వేలాది మంది భక్తులు తరలివచ్చారు. అనంతరం భక్తులకు అన్న సమారాధన జరిగింది. పీఠంలో ప్రేమ మందిరం బాల బాలికలు ఆలపించిన స్తోత్ర పారాయణ అలరించింది. కామాక్షీ పీఠం మహా సంస్థానం ట్రస్టీ, ప్రేమ మందిరం అమ్మ వక్కలంక వాణి, పీఠం మేనేజర్ మర్రి దుర్గారావు పాల్గొన్నారు.

**తాళ్లరేవు:** గణపతి నవరాత్ర మహోత్సవాల ముగింపు నేపథ్యంలో విగ్రహాల నిమజ్జనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. తాళ్లరేవులోని పలు విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువెళ్లి ఆత్రేయ గోదావరిలో నిమజ్జనం చేశారు. పరదేశమ్మ వీధిలో శ్రీవరసిద్ధి వినాయకునికి ప్రత్యేక పూజలు చేశారు. యువతకు క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. అదేవిధంగా కాపులపాలెంలో వేడుకల ముగింపు సందర్భంగా కమిటీ సభ్యులు గణపతి చిత్రంతో కూడిన ప్రత్యేక టీ షర్టులు ధరించి స్వామివారిని నిమజ్జనానికి తీసుకెళ్లారు.

**గణపతి లడ్డూకు వేలం**

**అల్లవరం:** మొగళ్లమూరు సెంటర్లో శ్రీసిద్ధి వినాయక స్వామి ఆలయంలో స్వామివారికి సమర్పించిన లడ్డును వేలం పాటలో మొగళ్లమూరుకు చెందిన చెల్లుబోయిన శ్రీనివాస్ రూ. 65,500కు కైవసం చేసుకున్నారు. అనంతరం ఆలయం వద్ద అన్నసమారాధ నిర్వహించి, వినాయక విగ్రహాన్ని ఊరేగించారు. ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, మాజీ సర్పంచ్ కాండ్రేగులు పెద్దబ్బాయి పాల్గొన్నారు.

**అమలాపురం పట్టణంలో..**

**అమలాపురం టౌన్:** పట్టణంలో దాదాపు 35 చోట్ల నుంచి నిమజ్జనోత్సవాలు జరిగాయి. వినాయక విగ్రహ నిమజ్జనోత్సవ ఊరేగింపులతో పట్టణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. స్థానికంగా 75 ప్రాంతాల్లో వినాయక చవితి మండపాలు వెలిశాయి. నారాయణపేట, కూచిమంచి అగ్రహారం, కొంకాపల్లి, కాలేజీ రోడ్లలో నెలకొల్పిన చవితి పందిరి నుంచి నిమజ్జన ఊరేగింపులు మొదలయ్యాయి. ఇలా 35 చోట్ల వినాయక మండపాల నుంచి గణపతి విగ్రహాలను నిమజ్జన ఊరేగింపులు సాంస్కృతిక ప్రదర్శనలు, బాణసంచా కాల్పులతో సాగాయి. ప్రధాన పంట కాలువలు, మరికొందరు అల్లవరం మండలం బోడసకుర్రు వద్ద వైనతేయ నదీ పాయకు వినాయక విగ్రహాలను తోడ్కొని వెళ్లి నిమజ్జనాలు చేశారు. పట్టణ సీఐ పి.వీరబాబు ఆధ్వర్యంలో ఎస్సైలు ఎస్ఆర్ కిషోర్‌బాబు, టి.శ్రీనివాస్‌లు ఊరేగింపులకు బందోబస్తు ఏర్పాటు చేశారు.

**ఉప్పలగుప్తం:** మండలంలోని గొల్లవిల్లి, భీమనపల్లి, విలసవిల్లి, చల్లపల్లి, వానపల్లిపాలెం, ఉప్పలగుప్తం గ్రామాల్లో వినాయక విగ్రహ నిమజ్జనోత్సవాలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో అన్నసమారాధనలు జరిగాయి.

**యానాం:** స్థానిక రాజీవ్‌రివర్ బీచ్ గౌతమీ గోదావరిలో నిమజ్జనోత్సవాలకు యానాం పరిసర ప్రాంతాలకు చెందిన గణనాథుని విగ్రహాలను తీసుకువచ్చాయి. ఎస్పీ వరదరాజన్ ఆధ్వర్యంలో పోలీసు యంత్రాంగం బందోబస్తు నిర్వహించింది. యానాం అగ్నిమాపకదళ సిబ్బంది గణనాథుని విగ్రహాలను ప్రత్యేక క్రేన్ సహాయంతో గోదావరిలో నిమజ్జనం చేసింది. పాత బస్టాండ్ సెంటర్, ఓల్డ్ రాజీవ్‌నగర్, కనకాలపేట, దొమ్మేటిపేట, బెజవాడ గార్డెన్స్, పిల్లారాయ ఆలయం తదితర సెంటర్లలో ఏర్పాటు చేసిన గణనాథుని విగ్రహాలను నిమజ్జనం చేశారు. కనకాలపేటలో కొలువైన వరసిద్ధి వినాయకుని 108 కేజీల లడ్డూను కాంట్రాక్టర్ కనకాల సత్యనారాయణ రూ.1.11 లక్షలకు, గణపతినగర్‌లో మరో లడ్డూను రూ.73 వేలకు పి.శ్రీనివాస్ వేలంలో దక్కించుకున్నారు.

**తాళ్లరేవు:** స్థానిక ప్రధాన రహదారిలో శ్రీరాంనగర్ వద్ద ఏర్పాటు చేసిన మండపంలో బాల గణపతి స్వామివారి 25 కిలోల లడ్డూను పరదేశమ్మ ప్రాంతానికి చెందిన నాయుడు నారాయణమూర్తి రూ.10,300కు దక్కించుకున్నారు. 12 కిలోల లడ్డూను కేశవస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ కొల్లు శ్రీనివాస్ రూ. 9400 కైవసం చేసుకున్నారు.

**అమలాపురం రూరల్:** బండారులంక ఊటుకూరివారి వీధిలో బాల గణపతి 75 కేజీల లడ్డూను వేలంలో రూ.50,116కు మట్టపర్తి హిమ వెంకట్ శ్రీసాయి దంపతులు దక్కించుకున్నారు.



అమలాపురం కూచిమంచి అగ్రహారంలో గణపతి విగ్రహ నిమజ్జన ఊరేగింపు



యానాం గోదావరిలో గణనాథుని విగ్రహాల నిమజ్జనం



కనకాలపేటలో వరసిద్ధి వినాయక లడ్డూను దక్కించుకున్న సత్యనారాయణ





